జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 28-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 146 పేజీలు: 8 వెల : రూ.7





## పోలీసుల సాక్షిగా.. వైసీపీ శేణులపై..

# టీడీపీ దాడి

* పోలీసుల ఎదుటే ఈ దురాగతం * పీఎస్‌కు చేరుకున్న మాజీ మంత్రి సీదిరి అనుచరులు * టీడీపీ, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు * మాజీ మంత్రి అప్పలరాజు హౌస్ అరెస్టు * పలాస కాశీబుగ్గలో ఉద్రిక్తత * భారీగా పోలీసుల మోహరింపు * టీడీపీ నేతల తీరును ఎండగట్టిన మాజీమంత్రి

**పలాస/శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27 (వార్త):** కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు చూస్తుండగా టీడీపీ శ్రేణులు వచ్చి వైసీపీ శ్రేణులపై దాడికి దిగారు. ఏకంగా పిడిగుద్దులు గుద్దుతూ విచక్షణరహితంగా కొట్టారు. దీన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు మౌనం దాల్చారు. ఈ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. టీడీపీ శ్రేణులు, పోలీసుల తీరుపై ప్రజలు అవాక్కయ్యారు. పలాసలో రౌడీ రాజకీయం పేట్రేగిపోతుందన్న అభిప్రాయం అందరిలోనూ ఉంది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకూ పలాసలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడిన ఘటనతో వైసీపీ శ్రేణులు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి టీడీపీ, పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ముమ్మందు అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా పోలీసులు మోహరించారు. వివరాల్లోకి వెళితే.. సోంపేట మండలం కొర్లం గ్రామానికి చెందిన బాలికపై టీడీపీ నేత దాడి చేసిన ఘటనపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు. పోలీసులు సీదిరి అప్పలరాజు ఇంటి నుంచి బయటకు రాకుండా హౌస్ అరెస్టు చేశారు. అయితే పలాస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన కొర్ల విష్ణు చౌదరి కేటీ రోడ్డుపై శనివారం రాత్రి వెళ్తుండగా కాశీబుగ్గలోని అప్పయ్య దొర విగ్రహం వద్ద మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరుడు అల్లు వెంకటరమణతో పాటు వైసిపి నాయకులు నిల్చుని ఉన్నారు. అటుగా వెళ్తున్న కొర్ల విష్ణు చౌదరి, అల్లు వెంకటరమణ మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో పరస్పర దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో కొర్ల విష్ణు చౌదరికు గాయాలు కాగా తనపై కత్తితో దాడి చేశాడని అల్లు వెంకటరమణ కాశీబుగ్గ పోలిసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. ఇంతలో గాయాలతో విష్ణు చౌదరితో పాటు టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. గాయాలతో ఉన్న టీడీపీ నాయకుడిని వైద్య పరీక్షల కోసం పంపించకుండా మాజీ మంత్రి అనుచరుడు అల్లు వెంకటరమణకు పోలీసు స్టేషన్‌లో కూర్చోపెట్టి మర్యాదలు చేస్తారా అంటూ టిడిపి నాయకులు పోలీసులతో వాగ్వాదం చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వచ్చిన అల్లు వెంకట రమణతో పాటు మాజీ మంత్రి మరో అనుచరుడు మొదలవలస మన్మథరావుపై పోలీస్ స్టేషన్‌లో టిడిపి నాయకులు దాడికి దిగి చితగ్గొట్టారు. ఇదిలా ఉండగా కొర్లం గ్రామానికి చెందిన బాలిక, తన తల్లి తమ పై శుక్రవారం అర్ధరాత్రి సమయంలో దాడి చేసిన ఘటనపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు స్పందిస్తూ పలాస నియోజకవర్గంలో బాలికలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆదివారం ఉదయం పోలీస్ స్టేషన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కాశీబుగ్గ డిఎస్పీ శ్రీనివాసరావు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పోలీస్ స్టేషన్‌కు రాకుండా కాశీబుగ్గ సిఐ డి మోహనరావుతో పాటు కాశీబుగ్గ డివిజన్ పరిధిలో ఉన్న సిఐలు, ఎస్సైలు ఆయన ఇంటి వద్దకు చేరుకుని హౌస్ అరెస్టు చేశారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఇంటి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు వ్యవహార శైలిను వైసీపీ నాయకులు తప్పుబట్టారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ గౌతు శిరీష డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు బాలిక, తల్లి పై దాడి చేసిన టిడిపి నాయకుడుపై పోక్సో చట్టంపై అరెస్టు చేయాలని, తన అనుచరులను పోలీస్ స్టేషన్‌లో దాడి చేసిన వారిపై హత్యా చట్టం కింద కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరారు.



## 1న జిల్లాకు సీఎం చంద్రబాబు

* సిక్కోలు నుంచే ఉచిత గ్యాస్ పంపిణీకి శ్రీకారం
* స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే అశోక్, అధికారులు

**కంచిలి, అక్టోబరు 27 (వార్త):** సిక్కోలు నుంచే ఉచిత గ్యాస్ పంపిణీకి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాన్ని వచ్చేనెల 1న సీఎం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్వయంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం రాత్రి సోంపేటలోని జూనియర్ కళాశాల మైదానం, కొర్లాం ప్రాంతాలతోపాటు.. కంచిలి మండలం మఖరాంపురం, అంపురంలో స్థలాన్ని ఎమ్మెల్యే అశోక్, అధికారులతో కలిసి పరిశీలించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉద్యోగ భద్రత కల్పించాలి

**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** నరసన్నపేట ఉన్నత పాఠశాలలో ఆదివారం సీఆర్ఎంటీ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ భద్రత, సమ్మె కాలపు జీతం, ఉద్యోగ నోటిఫికేషన్లో వెయిటేజ్ వంటి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీటీ నాయుడు, గౌరవ అధ్యక్షుడు రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.గిరిధర్, కోశాధికారి ఢిల్లీశ్వరరావు, రామకృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



# హరిపురంలో లయన్స్ క్లబ్ సామాజిక సేవ

■ ఆసుపత్రికి సిమెంట్ బెంచీల వితరణ ■ 108 సిబ్బందికి ఘన సన్మానం



హరిపురం సీహెచ్‌సీకి సిమెంట్ బెంచీలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**మందస, అక్టోబర్ 27(వార్త):** మందస మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ కోస్టల్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సామాజిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో రోగులు కూర్చొనడానికి సిమెంట్ బెంచీలు అందజేశారు. ఎల్లప్పుడూ రోగులతో బిజీగా ఉండే హరిపురం సీహెచ్‌సీలో ఈ బెంచీలు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు లయన్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. 108 సిబ్బందిని లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించింది. పుష్పగుచ్ఛాలను అందించి, దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎనలేనివని, ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న 108 ఉద్యోగులు నిజమైన హీరోలని వారు కొనియాడారు. సిబ్బంది మురళీమోహన్, కృష్ణ, శంకర్, రామచంద్ర, సత్యంను అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భైరిశెట్టి గున్నయ్య, కార్యదర్శి వైఎస్ఎన్ మూర్తి, కోశాధికారి ఎం.లక్ష్మణ్, కొర్ల కన్నారావు, కె.దాశరథి, పి.ప్రదీప్, జె.రాము, పుల్లా వాసు, ఎం.అశోక్, జడ్పీ హేమచంద్ర. ఆర్.పాపారావు, డాక్టర్ జోగినాయుడు, 108 జిల్లా మేనేజర్ హరిప్రసాద్, ఓఈ జగన్, సిబ్బంది ఎన్.వెంకటరావు, ఎ.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



108 సిబ్బందిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**పోలాకి, అక్టోబర్ 27(వార్త):** ఈదులవలస గ్రామానికి చెందిన కొండక వెంకటేష్ అనారోగ్యానికి గురికావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.62470లు ఆయనకు మంజూరైంది. ఈ మేరకు ఆ చెక్కును లబ్ధిదారునికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కత్తిరివానిపేటలోని తన కార్యాలయంలో ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బొమ్మాళి బలరాం, లొట్ల శీను తదితరులు పాల్గొన్నారు.

**జలుమూరు:** అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న జలుమూరు మండలం అల్లాడ గ్రామానికి చెందిన మొజ్జాడ కృష్ణవేణికి రూ.50000లు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైంది. ఈ మేరకు ఆ చెక్కును ఆమెకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదివారం అందజేశారు.

కార్యక్రమంలో లింగాల వలస, చల్లవానిపేట సర్పంచులు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, వంశధార మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, సనపల రమణమూర్తి, దుద్ది నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.





## 'కేంద్రం అనుమతిస్తే అదనపు పని దినాలు'

**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తేనే ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పిస్తామని సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ తిరుపతిరావు తెలిపారు. ఆదివారం ఆయన అంగూరు సచివాలయం భవనంలో 2023 - 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ స్బింది పాల్గొన్నారు.

## శ్యామ్‌కు చేయూత



**సోంపేట, అక్టోబర్ 27(వార్త):** సోంపేట మండలం బెంకిలి గ్రామానికి చెందిన సంగారు శ్యామ్ బ్రెయిన్ స్ట్రోక్‌తో కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానికే పరిమితమయ్యారు. వైద్య ఖర్చులు అధికంగా ఉండడంతో గ్రామస్తుల నుంచి సాయం కోరిన నేపథ్యంలో రూ.42,000 సేకరించి ఆయనకు ఆదివారం అందజేశారు సాయం అందించిన దాతలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్యామలా ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జుత్తు పురుషోత్తం, సర్పంచ్ ప్రతినిధి పిరియా ధర్మేంద్ర, గుజ్జల శంకరరావు, షావుకారి ప్రేమ్ కుమార్, బార్ల ప్రదీప్, భైరి కుమార్‌స్వామి, విజయ్ పాణిగ్రహితదితరులు పాల్గొన్నారు. ఆర్థిక సాయం అందించిన దాతలను గ్రామస్తులు అభినందించారు.

## తమ్మిరెడ్డిని కలిసిన జనసేన నేత రాజు



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 27(వార్త):** రాష్ట్ర సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ను జనసేన నాయకులు దాసరి రాజు కలిశారు. చైర్మన్‌గా నియమించబడ్డ ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సింహాచలం వరహాలక్ష్మీనరసింహ సన్నిధిలో పూజ నిర్వహించిన కండువా, శాలువాతో సత్కరించారు. ఎన్నో ఉన్నతమైన పదవులు పొంది,ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.

## కొండ పోలమ్మ కాలనీలో నీటకి కట..కట

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 27(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 20 వార్డు కొండపొలమ్మ కాలనీలో నీటి ఇక్కట్లు తప్పడం లేదు. కాలనీలో మౌలిక వసతులు లేవు. ముఖ్యంగా పైపులైన్ లేక ఇబ్బందులు పడుతున్నారు. కొంతవరకు పైప్ లైన్ వేసి వదిలేయడంతో నీటి సరఫరా జరగడం లేదు. ట్యాంకర్ ద్వారా కూడా నీటి సరఫరా జరగడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గోరువాని చెరువులో పారిశుద్ధ్య పనులు

**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** నరసన్నపేటలోని గోరువాని చెరువులో స్వచ్ఛమైన నీరు నింపేందుకు పారిశుధ్య పనులు చేస్తున్నామని సర్పంచ్ శంకర్, ఉప సర్పంచ్ కృష్ణబాబు ఆదివారం తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా జమ్ము జంక్షన్ నుంచి పంట కాలువను శుభ్రం చేస్తున్నామని వారు తెలిపారు. ఆ కాలువ ద్వారా వచ్చే మంచినీటితో చెరువును నింపి కార్తీక మాస స్నానాలకు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





## కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బగ్గు

**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** శ్రీకాకుళం ప్రజాసదన్‌లో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహనాయుడును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కలిశారు. ఈ సందర్భంగా ఆయన నరసన్నపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మించాలి



**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** నరసన్నపేటలోని సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ నూతన ప్రహరీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు. ప్రహరీ నిర్మాణానికి గ్రౌండ్ వర్క్ నిర్మాణం పూర్తి చేసి గత కొన్ని నెలలుగా విడిచిపెట్టారని స్థానికులు వాపోయారు. ప్రహరీ నిర్మాణం చేయకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రహరీని పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

## ముమ్మరంగా జనుము సాగు



**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** జలుమూరు మండలం యలమంచిలి-కొండ కామేశ్వరపేట గ్రామంలో జనుము సాగు ముమ్మరంగా సాగుతోంది. నీటి లభ్యత లేని మెట్టు భూములలో రైతులు ఈ పంటను సాగు చేస్తారు. గోగుపంట నుంచి గోగునార, జనుము కర్రలు వేరుచేస్తారు. దీపావళి పండుగ నిర్వహణకు జనుము కర్రలు సంప్రదాయంగా ఉపయోగిస్తారు. గోగునారను నరసన్నపేట ప్రాంతాలో విక్రయిస్తుండగా, జనుము కర్రలు వివిధ గ్రామాలకు తీసుకువెళ్లనున్నట్లు రైతులు తెలిపారు.

## వైజాగ్ రైల్వే జోన్లో సోంపేట విలీనం చేయాలి

**సోంపేట, అక్టోబర్ 27(వార్త):** సోంపేట రైల్వేస్టేషన్‌ను విశాఖ రైల్వే జోన్‌లో విలీనం చేయాలని కోరుతూ కంచిలి రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి బుడ్డెపు కామేష్ రెడ్డి, కొంచాడ రవి ప్రసాద్, రమేష్, రైల్వే కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఖుర్దా డివిజన్‌లో అత్యంత ప్రాధాన్యత ఉన్న సోంపేట రైల్వే స్టేషన్ పరిధిలో కంచిలి, సోంపేట, కవిటి మండలాలకు చెందిన వందలాది గ్రామాలు ప్రజలు ఆధారపడి ఉన్నా రని, ఈ స్టేషన్‌ను వైజాగ్ రైల్వే జోన్లో విలీనం అటు రైల్వేకు ఆదాయంతో పాటు ప్రయాణికులకు మరింత మెరు గైన సదుపాయాలు కలుగుతాయన్నా రు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక స్టేషన్ మాస్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# విద్యుత్ చార్జీల పెంపు సరికాదు



**సోంపేట, అక్టోబర్ 27(వార్త):** విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సోంపేట శైలజ కళ్యాణ మండపంలో సీపీఎం సోంపేట మండల మహాసభ జరిగింది. తొలుత ప్రభుత్వ హాస్పటల్ వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి గాంధీ మండపం మీదుగా శైలజ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. పార్టీ జెండాను పార్టీ సీనియర్ నాయకులు దుంపల కృష్ణారావు ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సీపీఎం అఖిలభారత కార్యదర్శి సీతారాం ఏచూరి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరవీరులకు సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు.అనంతరం జరిగిన సభలో తులసీదాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతర భారాలను తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చిన టీడీపీ అధికారంలోకి వచ్చాక, ఆ హామీకి భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు 2022-23 సంవత్సరానికి సుమారు 6072 కోట్ల రూపాయల భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి మరో 11 వేల కోట్ల రూపాయలకు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపబోతున్నారని తెలిసిందన్నారు. మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయల భారం రాష్ట్ర ప్రజలపై పడబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యుత్ కంపెనీల దోపిడీ, అధిక రేట్లకు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు, వివిధ స్థాయిల్లో అవినీతి, విధానాలతో విద్యుత్ వ్యయం పెరుగుతోందన్నారు. ఆ భారాన్ని సర్దుబాటు చార్జీల రూపంలో జనం నెత్తిన వేయడం అసమంజసం కాదన్నారు. ఇప్పటికే వివిధ రకాల పేర్లతో విద్యుత్ చార్జీలు అధిక భారంగా ప్రజల భావిస్తున్నారన్నారు. నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, టమోటా వంటి నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్నంటాయన్నారు. ఈ సమయంలో ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, ఇలాంటి అదనపు భారాలు మోపటం సరికాదన్నారు. కావున తక్షణమే ఈ నోటిఫికేషన్ ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఏనాడో వాడుకున్న విద్యుత్తుకు ఆ తర్వాత కాలంలో అదనంగా వేసే సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు అక్రమంగా బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేశారని ఆ మేరకు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్‌రావు మాట్లాడుతూ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని, రైతులకు మోసం చేస్తున్న సోంపేటలో గోల్డ్ ల్యాండ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆర్బీకేళ ద్వారా కొనుగోలు చేయాలని, నిత్యావసర వస్తువుల సరుకుల ధరలు తగ్గించాలని, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్రం జమిలి ఎన్నికల ప్రతిపాదన విరమించుకోవాలని, మహిళలపై అత్యాచారాలు అరికట్టాలని విన్నవించారు.

జుట్టు సింహా చలం అధ్యక్షతన జరిగిన సభలో సీపీ ఎం మండల నాయకులు సంగారు లక్ష్మీనారాయణ నివేదిక ప్రవేశపెట్టారు. గత కార్యక్రమాలను సమీక్షించి భవి ష్యత్ కర్తవ్యాలను రూపొందించారు. కార్యక్రమంలో టి.పాపారావు, డి. హేమయ్య, పి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కార్యదర్శిగా సంగారు లక్ష్మీనారాయణను, మండల కమిటీ సభ్యులుగా జుత్తు సింహాచలం, దున్నయామయ్య షణ్ముఖరావు, ధర్మారావు, చిరంజీవిని ఎన్నుకున్నారు.

## చెకుముఖి పోటీల్లో ప్రథమస్థానంలో జలుమూరు విద్యార్థులు





**జలుమూరు, అక్టోబర్ 27(వార్త):** శ్రీకాకుళంలో ఆదివారం జిల్లాస్థాయిలో జరిగిన చెకుముఖి పోటీల్లో జలుమూరు మండలం కరవంజ మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయిలో 1వ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో 1వ స్థానం సాధించిన హేమశిరీష (10వ తరగతి), ఆర్.ఎర్రన్నా యుడు(9వ తరగతి),టి.ధరణి(8వ తరగతి) లకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మూఢనమ్మకాలు విడిచిపెట్టి, సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు.

**4వ స్థానంలో సారవకోట..**

సారవకోట మండలం బుడితి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో 4వ స్థానం సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం మాధవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈసారి మరింత సత్తా చాటాలని కోరారు.

## ఆధ్యాత్మికత భావాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలి



**మెళియాపుట్టి, అక్టోబర్ 27(వార్త):** మెళియాపుట్టి మండలం చాపర గ్రామంలోని బ్రహ్మకుమారీస్ (త్రిలోక్ భవన్) చైతన్య శివాలయంలో రాజయోగిని బీకే సుధ నేతృత్వంలో బెంగళూరుకు చెందిన రాజయోగ టీచర్, ఆధ్యాత్మిక సాధకులు బీకే మంజునాథ్ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక సత్యానారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక (భక్తి) భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భగవంతునికి చేరువ కావడానికి ఆధ్యాత్మిక ప్రవచనాలను వివరించారు. పూజాదికాలు, సేవా కార్యక్రమాలు వంటి అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. మానవాళి విశ్వశాంతికి యోగ, ప్రయోగ విధానం, భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక మేలుకొలుపు, ప్రయోగాత్మక ఆత్మ జాగృతి నిర్వహించి వారికి మేలు చేకూర్చడమే లక్ష్యంగా ఓంశాంతి సంస్థ ముందుకు సాగుతోందన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతిరోజూ చాపర బ్రహ్మకుమారి చైతన్య శివాలయంలో భక్తి, స్ట్రెస్ ఫ్రీ లైఫ్, ఆర్ట్ ఆఫ్ హ్యాపీనెస్, సెల్ఫ్ రియలైజేషన్, వాల్యూస్, డిసిప్లెయిన్, గోల్ సెట్టింగ్స్, హెల్త్ అవేర్నెస్, భక్తి జ్ఞాన సంఘం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాజయోగినిలు బీకే వనజ, రాజ్యలక్ష్మి, మోహిని, విజయ, 30 మంది దంపతులతో పాటు 100మందికి పైగా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎదుగుదల ఓర్వలేకే దుష్ప్రచారం

**పలాస-కాశీబుగ్గ, అక్టోబర్ 27(వార్త):** తన ఎదుగుదలను ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ నేత కుక్కర ఢిల్లీరావు తెలిపారు. తల్లి, తనయలపై దాడి విషయమై ఆయనపై పలాస పోలీస్‌స్టేషన్లో పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఆదివానం సాయంత్రం ఆయన పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేఖరులతో మాట్లాడారు. 2018 నుంచి సుదీష్ణ తన దగ్గర పనిచేస్తోందని, ప్రతి ఈవెంట్‌లో చాలా చురుకుగా పాల్గొనేదన్నారు. ఆ నమ్మకంతోనే ఉద్దానం ప్రాంత గ్రామాల్లో జరిగే గౌరీ సంబరాల ఉత్సవాలలో పాల్గొనేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాన న్నారు. అయితే ఒక్కసారిగా తాను రాను అని మెసేజ్ పెట్టగా, సరే అన్నానని తెలిపారు. కానీ ఆమె తల్లి మెసేజ్‌లు పెట్టి హెచ్చరించారని వాపోయారు. పెద్ద రాజం గ్రామంలో శనివారం ఈవెంట్స్‌లో పాల్గొంటూ వస్తుండగా, ఆమె కనిపించగా తనను హెచ్చరించడం సరికాదని హితవు పలికానని తెలపారు. కానీ కొట్టడం గానీ, తిట్టడం గానీ చేయలేదన్నారు. ఇదంతా తన రాజకీయ ఎదుగుదల తట్టుకోలేక కొందరు దురుద్దేశంతో చేసిన కుట్ర అన్నారు. ఆయన వెంట జేసీ ఈవెంట్స్ సభ్యులు, బొడ్డపాడు గ్రామ మహిళలు, గ్రామస్థులు ఉన్నారు.

# పైప్‌లైన్ లీక్..నిలిచిన నీటి సరఫరా..!

**వంగర, అక్టోబర్ 27(వార్త):** మగ్గూరు పైపులైన్‌కు నెల రోజుల్లోనే రెండు సార్లు ఒకే చోట లీకులు ఏర్పడడంతో సంబంధిత అధికారులు ఈ పనుల్లో ఎంత నాణ్యత పాటిస్తున్నారో నన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మూడు దినాలుగా మంచి నీటి సరఫరా పలు గ్రామాలకు నిలిచిపోయింది. వంగర మండలంలోని మగ్గూరు వద్ద ఉన్న మంచినీటి పథకం నుంచి అన్ని గ్రామాలకు ప్రధాన పైపు లైన్లు ఉన్న విషయం తెలిసిందే. ఈ పైపు లైనుకు ఎం.సీతారాంపురం గ్రామంవద్ద ప్రధాన పైపు లైనుకు లీకులు ఏర్పాటు కావడంతో అనేక గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఎం.సీతారాంపురంలో మంచి నీటిపైపు లైనుకు ఒకే చోట గత నెల దినాల కిందట ఎక్కడైతే పైపులైన్



పూర్తిగా పాడైయ్యిందో, మూడు రోజుల క్రితం అదే చోట ప్రధాన పైపులైను పాడైంది. దీంతో మండలంలో కొట్టిశ, బంగారు వలస, ఎం.సీతారాంపురం, మద్దివలస, లక్ష్మింపేట, కొప్పరవలస, కొత్తవలస, కొండ చాకరాపల్లి, కొప్పర తదితర గ్రామాలకు మంచినీటి సంఫరా నిలిచిపోయింది. దీంతో మంచి నీటి కోసం ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఎం.సీతారాంపురం వద్ద పాడైన పైపు లైనుకు వెంటనే మరమ్మతులు చేపట్టి మంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రధాన పైపు లైన్‌కు సరైన మరమ్మతులు చేపట్టి ఆయా గ్రామాల ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యేటట్లు చూడాలని కోరుతున్నారు.

# ఆర్మీ ఉద్యోగికి కన్నీటివీడ్కోలు



**పోలాకి, అక్టోబర్ 27(వార్త):** సెల వులో ఉన్న ఆర్మీ ఉద్యోగి స్వగృహంలో హఠాన్మరణం చెందాడు. ప్రియాగ్రహా రం పంచాయతీ తెల్లవానిపేట గ్రామా నికి చెందిన కరుకోల రమేష్ (42) పిల్లల విద్యాభ్యాసం కోసం నరసన్నపేట లో నివాసం ఉంటున్నరు. ఆయన ఇటీవల విధుల నుంచి సెలవుపై ఇంటికి వచ్చారు. బుధవారం తిరిగి విధుల్లో చేరాల్సి ఉంది. అయితే ఆకస్మాత్తుగా ఆయన శనివారం మృతి చెందారు. రమేష్ హఠాన్మరణంపై కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులు దిగ్భ్రాంతి చెందారు. అనంతరం మృతుడిని స్వగ్రామం తెల్లవానిపేటను తరలించారు. రమేష్ మృతి సమాచా రం అందుకున్న ఆర్మీ అధికారి విశాఖ పట్నం ప్రధాన కార్యాలయం నుంచి కల్నల్ పాండే డల్బర్ సింగ్, ఆర్.హరి కృష్ణ ఇక్కడకు చేరుకుని సంతాపం తెలిపారు. ఎచ్చెర్ల ఏఆర్ ఎస్ఐ టి. ఉమాపతి తన సిబ్బందితో చార్మినియా పీరియడ్ నిర్వహించి కడసారి వీడ్కోలు పలికారు. మృతుడికి భార్య, కుమా రుడు, కుమార్తె ఉన్నారు.



# టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

**వంగర, అక్టోబర్ 27(వార్త):** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మజ్జి గణపతి టీడీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన వంగరలో విలేఖరులతో మాట్లాడారు. ప్రతి ఒక్క కార్యకర్త వంద రూపాయలు చెల్లించి సభ్యత్వాన్ని నమోదు చేసుకుంటే రూ.5 లక్షల వరకు జీవిత బీమా ఉంటుందన్నారు. ఎవరైతే పార్టీ కోసం కష్టపడతారో వారికి భవిష్యత్‌లో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యకర్తకు పట్టం కట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గతంలో బీమా పొందని 73 మందికి రెండు లక్షల చొప్పున ఇచ్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నిర్ణయించాం న్నారు. ప్రమాద బీమా కింద ఇప్పటి వరకు రూ.102 కోట్లు, సహజ మం ణం, ఇతర సమస్యలకు రూ.18 కోట్లు పార్టీ తరపున ముఖ్యమంత్రి అందించినట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తల కోసం తీసుకునే ఈ నిర్ణయంతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం కలుగుతుందన్నారు.



## ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు టీడీపీ శాశ్వత సభ్యత్వం

**పాతపట్నం, అక్టోబర్ 27(వార్త):** తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆ పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం రూ.లక్ష ఆన్‌లైన్‌లో చెల్లించారు.

## ఉచిత శిక్షణ..ఉద్యోగావకాశాలు



**శ్రీకాకుళం, అక్టోబర్ 27(వార్త):** హెచ్ పీసీఎల్ ఆధ్వర్యంలో నడుపుతున్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ సంయుక్తంగా బ్యూటీషియన్, హొటల్ మేనేజ్మెంట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ (నర్సింగ్), డేటా ఫీడర్, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కోర్సులు విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ లోని సెకండ్ ఫ్లోర్ లో ఉన్న స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ నందు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులు చేసేందుకు ఇంటర్, డిప్లమో, ఐటీఐ, పదో తరగతి పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు గల విద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. ఈ మూడు నెలలు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ, ఉచిత భోజన, వసతి, యూనిఫామ్, బుక్స్, ఎ.సి క్యాంపస్ వంటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు తమ సంస్థ నందు లేదా 9121999654, 7993011695 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

### ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీఎండీగా అమ్రపాలి

**అమరావతి, అక్టోబర్ 27(వార్త):** తెలంగాణ నుంచి ఇటీవల ఏపీ క్యాడర్‌కు వచ్చిన ఐఏఎస్ అధికారులకు పోస్టింగ్‌లు ఇస్తూ సీఎస్ నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమ్రపాలిని..ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీఎండీగా ప్రభుత్వం నియమించింది. ఏపీ టూరిజం అథారిటీ సీఈఓగాను పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ జి.వాణీమోహన్‌ను బదిలీ చేసి.. సాధారణ పరిపాలన శాఖలో సర్వీసుల వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న పోలా భాస్కర్‌ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణీ ప్రసాద్‌ను నియమించారు. కార్మిక శాఖ అదనపు బాధ్యతల నుంచి ఎం.ఎం.నాయక్‌ను రిలీవ్ చేశారు. ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా వాకాటి కరుణను నియమించారు. జాతీయ హెల్త్ మిషన్ డైరెక్టర్‌గా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## విషాదం

- **రోడ్డు ప్రమాదంలో ఆధ్యాత్మికవేత్త షణ్ముఖరావు మృతి**
- **కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు**
- **బహడపల్లిలో విషాదఛాయలు**

**మందస, అక్టోబరు 27(వార్త):** ఆ యువకుడు పేద కుటుంబంలో జన్మించాడు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేయడానికి ఇంజనీరింగ్ చదువుతున్న తరుణంలోనే ఆధ్యాత్మికత వైపు దృష్టి మరల్చాడు. ఇస్కాన్లో చేరి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆ యువకుడిపై విధి కన్నుకుట్టి.. ఆ దైవసన్నిధికి అనతికాలంలోనే చేర్చింది. మంచి భవిష్యత్ ఉన్న ఆ యువకుడు అర్ధాంతరంగా మరణించడంతో ఆయన స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని బహడపల్లి గ్రామానికి చెందిన బొట్ట షణ్ముఖరావు (23) పేద కుటుంబానికి చెందిన సాంబమూర్తి, సుజాత దంపతులకు ప్రథమ సంతానం షణ్ముఖరావు జన్మించాడు. కర్రల మిల్లులో కూలీగా సాంబమూర్తి, జీడిపిక్కల ఫ్యాక్టరీ(బడ్డీ)లో కూలీగా సుజాతలు పని చేస్తూనే.. కుమారుడ్ని ప్రయోజకుడుగా చేయాలని ఎంతో కష్టంతో అనంతపురంలో బీటెక్ చదివించ సాగారు. ఓ వైపు ఇంజనీరింగ్ చదువుతునే షణ్ముఖరావు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు. ఇస్కాన్ సంస్థలో చేరి.. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్నేహితులతో పాలుపంచుకునేవాడు. తాడిపత్రిలో జరుగుతున్న ఓ కార్యక్రమానికి ఆరుగురు మిత్రులతో కలసి, వెళ్లిన షణ్ముఖరావు తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న వాహనం శింగనమల మండలంలోని నాయనపల్లి వద్ద టైరు పేలి, ఓ లారీకి ఢీకొట్టడంతో అక్కడికక్కడే ఆరుగురు కూడా మరణించారు. అందరితో ఎంతో చనువుగా ఉండే షణ్ముఖరావు మృతితో ఉద్దానంలో విషాదం నెలకొంది. అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం సోమవారం షణ్ముఖరావు మృతదేహం బహడపల్లి గ్రామానికి వస్తుందని కుటుంబసభ్యులు చెప్పారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

**రాజుల పేరు సనపలగా మార్చేందుకు ప్రయత్నం**

**ముఖలింగంలో సర్వే నంబర్ మార్చి రిజిస్ట్రేషన్**

**అన్నపురంలో దేవుడు భూముల్లో ఇళ్ళు కట్టడం వారికే చెల్లు**

**టౌన్ ప్లానింగ్‌లో పనిచేసి ఖాళీగా ఉండటంతో దుర్బుద్ధి**

**నీతులు చెప్పే వాళ్ళే ... చావు దెబ్బలు తిన్న వాళ్ళు**

# ఆరోపిస్తున్న వారే అక్రమార్కులు...!





జలుమూరు, అక్టోబర్ 27 (వార్త): పూర్వాశ్రమంలో గడ్డ కట్టు మీద నీటి దొంగల్ని వెతికి పట్టుకునేందుకు గోచి కట్టుకుని తిరిగేవాడు ఓ వ్యక్తి. వాళ్ళ కాళ్లు.. వీళ్ళ కాళ్లు పట్టుకొని కాలం కలిసి వచ్చి దొంగ సర్టిఫికెట్లు తయారు చేసి మొత్తానికి మున్సిపాలిటీలో ఉద్యోగం కొట్టాడు. బల్ల కింద చేతులు చాపి నాలుగు రాళ్ళు వెనకేసాడు. రాళ్ల బరువు దించుకోవడానికి ముఖ లింగం ఊరు మీద పడ్డాడు. లిటిగేషన్‌లో ఉండే సైట్లపై కన్నేసాడు. శ్రీకాకుళంలో వీడికి మరో పనికిమాలిన వాడు తోడయ్యాడు. వాడి పేరు చెప్తే అందరూ ముఖాన్నే ఊసేలా గత చరిత్ర ఘనంగా ఉంది. రాజుల పేరుతో ఉన్న వ్యక్తి కాలింగ అంటాడు. ఇంటి పేరు రాజులైనా గ్రామంలో గాజులు అంటేనే తెలుస్తుంది. గాజులు అమ్మే వాళ్ళని గాజులు అంటారు గానీ రాజులు, సనపల అనరు కదా. పిల్లలకు పెళ్లిళ్లు చేయాలాయే. పేరు సనపలుగా మార్చేస్తే బాగుంటుందని తనలో ఉండే ఆఫీసరు కోణాన్ని బయటకు తీశాడు. ఈ ప్రయత్నంలో సహాయం చేద్దామనుకున్న ఒక డీటీ సస్పెండ్ అయిపోవాల్సింది.. చివరి నిమిషంలో బలవంతపు బదిలీపై వెళ్లి పోవాల్సి వచ్చింది. దీంతో సనపలగా మారిపోదాం అనుకున్న తన కల అక్కడితో ఆగిపోయింది. ఇక అన్నపురం విషయానికి వస్తే సర్వే నంబర్ 1లో నరసింహస్వామి మఠం భూములు ఉన్నాయి. అదంతా 120 ఎకరాల్లో ఉంది. ఇందులో కూడా మన రాజుల వారే దగ్గరుండి తన ఇరకాడికి ఇంద్రభవనం కట్టించాడు. అంతేకాదు ఐదు ఎకరాల ఆక్రమించి రూపాయి సిస్ట్ కూడా కట్టకుండా దాన్నుంచి వచ్చే ఫలసాయాన్ని కడుపారా ఆరగిస్తున్నాడు. అతడు కూడా వైద్య ఆరోగ్య శాఖలో రిటైర్డ్ ఉద్యోగి. రిటైర్డ్ ఉద్యోగులంతా ఖాళీగా ఉండటంతో స్కెచ్‌లు వేయడం కొల్లగొట్టేయడం నిత్య కృత్యంగా మార్చుకున్నారు. ఇక ముఖలింగం గ్రామంలో 38 సర్వే నెంబరు, 1 నుంచి 8 వరకు సబ్ డివిజన్లలో ఏళ్ల తరబడి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కొనుగోలుదారులు అమ్మకందారులు ఆ భూమిపై సాగు చేసుకుని జీవిస్తున్నారు. అక్కడ మన లస్కర్ భూమి కొనడం మొదలు గ్రామంలో వివాదాలు మొదలయ్యాయి. తన చేతివాటం కిందిస్థాయి రెవిన్యూ ఉద్యోగులకు కూడా అలవాటు చేసి భూమిపై సబ్ డివిజన్లను చెల్లాచెదురు చేసేసాడు. ఫలితంగా అందరి భూములు తప్పుడు భూములు అనే చెప్పేలాగా రికార్డులు తారుమారు చేసేసాడు. అంతే గ్రామస్తులంతా కలెక్టర్‌కి, ఆర్డీఓకి గ్రీవెన్స్ కోసం పరుగులు తీశారు. సమస్యను తేల్చాలని కాగితాలు మళ్ళీ కింద స్థాయి రెవెన్యూ ఉద్యోగులకు వస్తాయి. ఇంకేముంది ముందే చేతులు తడిపినట్లు తెలుస్తోంది. వాళ్లు ఇదిగో అదిగో అంటూ కాలం వెలదీసేస్తున్నారు.

మన లస్కరు ఆకలి అంతటితో ఆగడం లేదు పొరుగునే ఉండే భూములను కూడా కలిపేయాలని ప్రయత్నం అతనిది. తన కొనుక్కున్నది సర్వే నెంబరు 38-6. డాక్యుమెంట్లో ఉన్న విస్తీర్ణం ఎకరా 13 సెంట్లు. గ్రౌండ్లో చూస్తే మరో రెండు సెంట్లు ఎక్కువే ఉంది. కానీ అతగాడికి ఎకరా 27 సెంట్లు కావాలంట. 38-5 వాస్తవానికి సర్వే నెంబరు. రికార్డులు మార్చడంలో దిట్ట గనక ఈ భూమి క్రయ విక్రయాలు జరిగే పది రోజులు ముందు రికార్డులు మార్చేశారు. పాత భూమిని బౌండరీలు ప్రకారం తనకి ఇచ్చేయాలని బెదిరింపులకు దిగాడు. పోలీసుల్ని, రెవిన్యూని రంగంలోకి దింపాడు. ఎస్పీ గ్రీవెన్స్ కి కలెక్టర్ గ్రీవెన్స్ కి విషయాన్ని గుంట కర్ణ వీరుడు తీసుకువెళ్లాడు. అంతే ఏదేదో ఆశ చూపి తీసుకొచ్చిన వాళ్ళు తోక ముడిచారు. వ్యవహారం ఎమ్మెల్యే దృష్టికి కూడా చేరింది. గ్రామంలో రీ సర్వే నిర్వహించి డాక్యుమెంట్లు ప్రకారం ఎవరు భూమికి వారే అందజేయాలని దేవుడు భూమిని కాపాడాలని ఆయన స్వయంగా చెప్పాడు. ఎమ్మెల్యే చెప్పినట్లు పూర్తిస్థాయి సర్వే జరిగితే ఎవరి లెక్కలు వాళ్ళవి తేలిపోతాయి. ముందుంది ముసళ్ల పండుగ.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413